నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కర్నూలు | నంద్యాల

శుక్రవారం | 21 మార్చి 2025 | పేజీలు 8




రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

### 22న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

## జిల్లా పర్యటన

- జిల్లా ఎస్పీతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 22న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జిల్లాకు రానున్నారని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేసి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో




డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయం




ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ముసలం పుట్టింది. వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ మరియు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ శాఖలో వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో ఉంటాయి. మూడు శాఖలు ప్రిన్సిపల్ సెక్రటరీ క్రింద విధులు నిర్వహిస్తారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి నంద్యాలలో వైద్య కళాశాల వచ్చిన తరువాత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మారిపోయింది.

మిగతా 7లో




డీసీహెచ్ఎస్ కార్యాలయం

- డిఎం అండ్ హెచ్ఓ, డీసీహెచ్ఎస్ కార్యాలయాలు ఖాళీ చేయాలంటున్న సూపరింటెండెంట్
- ప్రిన్సిపాల్ సెక్రెటరీ మౌళిక ఆదేశాలు బేఖాతర్
- పాణ్యం సీహెచ్‌సీకి తరలిపోనున్న డీసీహెచ్ఎస్ కార్యాలయం
- ప్రస్తుత కార్యాలయం తమదేనంటున్న డీఎంఅండ్ హెచ్ఓ శాఖ

## వైద్య,ఆరోగ్య శాఖలో ముసలం




నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

### రామయ్యా !

## అవినీతికి అంతేదయ్యా..

- ప్రైవేట్ ట్రస్ట్‌ను బెదిరించి టిడిఆర్ డబ్బు కాజేశారు..
- వక్ఫ్ భూములను అక్రమంగా రిజిష్టర్ చేయించుకొని అమ్మేసుకున్నారు
- కోట్లాది రూపాయల అక్రమ ఆస్తుల అర్జన
- కాంట్రాక్టర్లను ,రియల్ వ్యాపారులను దోచేసుకున్నారు
- ప్రజలకు మేయర్ సమాధానం చెప్పాలన్న కుడా ఛైర్మెన్ సోమిశెట్టి

**కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో :** కర్నూలు నగర మేయర్ రామయ్య అవినీతికి అంతే లేదని కుడా ఛైర్మన్, తెదేపా రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆరోపించారు. గురువారం జిల్లా తెదేపా కార్యాలయంలో తెదేపా కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేటర్‌గా పోటీ చేసే సమయంలో ప్రకటించిన ఆస్తులు, ఎంపిగా పోటీ చేసిన సమయంలో ప్రకటించిన ఆస్తులు పరిశీలిస్తే ఆయన ఆస్తులు ఎంత మేర పెరిగాయి? అన్నది తేలుతుందని ఆయన అన్నారు.

మిగతా 2లో



సమావేశంలో మాట్లాడుతున్న కుడా ఛైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

## సంఘమేశ్వరంలో పూజకు వేళాయె

- నదీ జలాల నుండి బయల్పడిన ఆలయం

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం తగ్గుతుండటంతో కృష్ణా నదిలో మునిగిన సంఘమేశ్వరాలయం నదీ జలాల నుంచి పూర్తిగా బయల్పడింది.

మిగతా 2లో



నీటి నుంచి పూర్తిగా బయల్పడిన సంఘమేశ్వరాలయం

## అసంపూర్తిగా భవన నిర్మాణాలు



మద్దూరులో అసంపూర్తిగా పాఠశాల భవన పనులు

- పట్టించుకోని అధికారులు
- సమస్యల్లో సర్కారు పాఠశాలలు

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని 20 పాఠశాలలకు రెండో విడత నాడు-నేడు కింద దాదాపు రూ.9.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆయా పాఠ శాలల హెచ్‌ఎంలు, కమిటీలు కలిసి పనులు ప్రారంభించారు.ప్రారంభించిన పనులు ఎక్కడికక్కడే

మిగతా 6లో

### ఉపాధ్యాయుడి

## కీచక పర్వం

- విద్యార్థినీల పట్ల అసభ్యకర ప్రవర్తన
- విద్యార్థినీలను అన్‌టచ్ ప్రదేశాలలో తాకుతూ ఇబ్బందులు
- విద్యార్థినీలకు యూట్యూబ్‌లో వీడియోలు చూపిస్తూ శునకానందం
- కులాలు,రంగుల వారిగా విద్యార్థినీలను విడదీసిన కీచకోపాధ్యాయుడు
- హెచ్‌ఎంకు ఫిర్యాదు.. మందలించి వదిలేశారంటున్న విద్యార్థినీలు
- కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేయడానికి పాఠశాలకు తరలివచ్చిన తల్లిదండ్రులు
- సమాచారం తెలుసుకొని ఫరారైన ఉపాధ్యాయుడు
- ఉపాధ్యాయుడి పై కఠినచర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు..
- కీచకోపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

2లో



ఉపాధ్యాయుడు బొజ్జన్న (ఫైల్‌ఫోటో)



పోలీసులతో మాట్లాడుతున్న విద్యార్థినీల తల్లిదండ్రులు

## 22న డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జిల్లా పర్యటన

(మొదటి పేజి తరువాయి)

డిప్యూటీ సిఎం ఓర్వకల్లు మండలం పుడిచెర్ల గ్రామ పరిధిలో ఉన్న రైతు పొలంలో ఫారంఫండ్‌కు భూమిపూజ చేసి తదుపరి బహిరంగ సభలో పాల్గొననున్న సందర్భంగా గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కలెక్టర్ రంజిత్‌బాషా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు,భద్రత గురించి ఎస్పీతో చర్చించారు. సుమారు 4వేల మంది వరకు బహిరంగ సభకు హాజరవుతారని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. స్టేజ్ అరేంజ్‌మెంట్స్,బారికేడింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించిన ఆర్‌అండ్‌బి ఎస్‌ఈకి పలు సూచనలు ఇచ్చారు. వేదికపై చేయవలసిన ఏర్పాట్లను చూసుకోవాలని జడ్‌పి సిఈఓను ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు,శిలాఫలకం ఏర్పాటు, బ్యాక్ డ్రాప్, తాగునీరు, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, ఎల్‌ఈడిలు తదితర ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్,ఎస్పీ ఎయిర్‌పోర్టును సందర్శించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్‌పి సిఈఓ నాసరరెడ్డి, ఎస్ఇ పిఆర్ రామచంద్రారెడ్డి, ఎస్ఇ ఆర్‌అండ్‌బి మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఇ ఆర్‌డబ్ల్యుస్ నాగేశ్వరరావు,ఎస్ఇ ట్రాన్స్‌కో ఉమాపతి,డిస్టిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ శాంత కుమారి, ఆర్‌టిసి ఆర్‌ఎం శ్రీనివాసులు, కర్నూలు ఆర్‌డిఓ సందీప్ కుమార్, డ్వామా పిడి వెంకట రమణయ్య, మెప్మా పిడి నాగశివలీల, డిఐపిఆర్‌ఓ జయమ్మ,కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్,డిఎమ్ సివిల్ సప్లైస్ నాగ సుధ,డిఎస్‌ఓ రాజా రఘువీర్, డిప్యూటీ డిఎం హెచ్‌ఓ భాస్కర్, ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహ,ఓర్వకల్లు తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఓ శ్రీనివాసులు,ఏపిఓ కుమార్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయండి..ఎంఈఓ ఇందిరా

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** విద్యార్థుల విద్యాభివృద్ధి ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులు కృషి చేయాలని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే లా విద్యను బోధించాలని మండల విద్యాధికారిణి ఇందిరా స్కూల్ యాజమాన్యానికి ఆదేశించారు. గురువారం పట్టణంలోని రాముల దేవాలయం దగ్గర ఉన్న శర్మాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకొని విద్యను బోధించాలని, పోటీ పరీక్షలలో ఉత్తమైన ఫలితాలు వచ్చే విధంగా విద్యార్థులపై ఒత్తిళ్ళు లేకుండా పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతరమైన పద్దతులను పాటించాలన్నారు. అనంతరం స్కూల్‌లోని రికార్డులను పరిశీలించారు.

## కె.జి.బి.వి పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సంజామలమేజర్,న్యూస్‌:** కె.జి.బి.వి సంజామల నందు 2025-2026 విద్యా సంవత్సరానికిగాను 6,11వ తరగతుల్లో ప్రవేశాల కోసం 9,10 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 22వ తేదీ నుండి ఏప్రిల్11వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని అనాధలు బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బి.సి, మైనార్టీ, బిపిఎల్ బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని కె.జి.బి.వి ప్రిన్సిపల్ బి. శ్రీలేఖ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వార వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తు హెచ్.టి.టి.పి.ఎస్‌://ఎపీకెజిబివి.ఎపీసిఎఫ్‌ఎస్‌ఎస్. ఇన్‌సైట్ ద్వార దరఖాస్తు చేసుకోవాలని ఎంపికైన విద్యార్థులకు ఫోన్‌కు మెసేజ్ సమాచారం అందుతుందని ఏమైనా సందేహాలు ఉంటే కె.జి.బి.వి పాఠశాలలో సంప్రదించాలన్నారు.

# రామయ్యా! అవినీతికి అంతేలేదయ్యా

(మొదటి పేజి తరువాయి)

ఆస్తులు ఒక్కసారిగా ఎలా పెరిగాయో మేయర్ రామయ్య చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రోడ్డు వేయించేందుకు శ్రీ భగవాన్ బాలసాయిబాబ సెంట్రల్ ట్రస్ట్‌కు చెందిన 77 లక్షల రూపాయల టిడిఆర్ మొత్తాన్ని మేయర్ కాజేశారని ఆయన ఆరోపించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెంబర్ 62051126603లో ఆ డబ్బు జమ అయ్యిందన్న సోమిశెట్టి ఆ ఖాతా ఎవరిదో చెప్పాలని మేయర్‌ను నిలదీశారు. అన్నీ సక్రమంగా ఉన్నా బాలసాయి సెంట్రల్ ట్రస్ట్‌ను బెదిరించి డ బ్బు ఖాతాలకు మళ్లించుకున్నారని ఆయన చెప్పారు. ఇది నిజమా? కాదా? తేల్చాలని ఆయనను డిమాండ్ చేశారు. అలాగే జొహరాపురం సర్వే నెంబర్ 154లో గుడేకల్లు మసీదుకు చెందిన 12.5 ఎకరాల భూమిని అక్రమంగా రిజిష్టర్ చేయించుకున్నారని, ఈ కారణంగానే సబ్‌రిజిస్ట్రార్ సస్పెండ్ అయ్యారని, దీనికి మేయర్ రామయ్య సమాధానం చెప్పాలని ఆయన కోరారు. వక్ఫ్ భూమిని ప్లాట్లుగా చేసి అమ్ముకుంటున్నారని కాపాడాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేసినా దౌర్జన్యపూరితమైన అప్పటి ప్రభుత్వం దాన్ని పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అవినీతిమయమైందని ఆయన ఆరోపించారు. పై నుండి కింది వరకు అంతా అవినీతికి పాల్పడ్డారని, ఇప్పుడు వారు సమాధానం చెప్పుకోవలసిన అవసరం వచ్చిందని ఆయన అన్నారు. అవినీతిలో అంతా పోటీ పడ్డారని ఆయన చెప్పారు. కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి సొమ్ము చేసుకున్నారని ఆయన చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా కర్నూలులో జరిగిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన అవినీతి చరిత్రకు అంతే లేదని ఆయన చెప్పారు. ఆయన మేయర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాము చేసిన ఆరోపణలకు 15రోజుల్లో సమాధానం చెప్పాలని, లేదంటా ప్రభుత్వం విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. కార్పొరేటర్ పరమేశ్ మాట్లాడుతూ మేయర్ రాజీనామా చేయాలని, నాలుగేళ్లలో ఆస్తులు ఎలా పెరిగాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మరో కార్పొరేటర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ చికెన్ వేస్ట్ తరలింపు విషయంలో సంబంధిత వ్యక్తుల నుండి మేయర్ రామయ్య 10లక్షల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. తమ వార్డుల్లో పనులకు సహకరించని రామయ్య తన వార్డులో మాత్రం కోట్లాది రూపాయల పనులు చేయించుకున్నారని, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో నగర తెదేపా అధ్యక్షుడు నాగరాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# సంఘమేశ్వరంలో పూజకు వేళాయె

(మొదటి పేజి తరువాయి)


నీటి నుంచి బయల్పడుతున్న వేపదారు శివలింగం

గురువారం నదిలో నీటి మట్టం తగ్గడంతో ప్రధాన ఆలయం పూర్తిగా బయటపడింది. గర్భాలయంలో అడుగు మేరా నీరు ఉన్నాయి. జలాశయంలో ప్రస్తుతం 838 అడుగుల నీటి మట్టం ఉండగా ఒక అడుగు నీరు తగ్గితే పూర్తిగా బయల్పడి నిత్య పూజలు జరుగనున్నాయి. ప్రస్తుతం ఆల యం చేరుకునేందుకు ఎలాంటి నీరు లేదు. గర్భగుడిలోనే కొద్ది మేరకు నీరు ఉండ టంతో ఆ నీటిలోనే పూజలు చేసేందుకు భక్తులు వెళ్తున్నారు. గత కొన్ని నెలలుగా నీటిలో మునిగి ఉండి వేపదారు శివలింగం పూజలకు దూరంగా ఉంది. ప్రస్తుతం ఆలయం నీటి నుంచి బయల్పడటంతో నిత్య పూజలు జరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆలస్యంగా ఆలయం బయటపడటంతో పూజలు అందుకోలేదు. ఆలయం పూర్తిగా బయల్పడిన నుంచి వేపదారు శివలింగానికి నిత్య పూజలు జరుగుతాయని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ తెలిపారు.


గర్భగుడిలో అడుగు మేరకు నీరు

# ఉపాధ్యాయుడి కీచక పర్వం



ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** తల్లిదండ్రుల తరువాతి స్థానం ఆ భగవంతుడు ఉపాధ్యాయుడికి ఇచ్చిన గొప్పవరం. ఇంటిలో పిల్లలు తల్లిదండ్రుల మాటనైనా వినరేమోగాని పాఠశాలలోని ఉపాధ్యాయుల మాటను తూచాతప్పకుండా వింటారు. విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పించి, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే బాద్యత కూడా ఒక ఉపాధ్యాయ వృత్తికే దక్కింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు భూత, భవిష్యత్తు వర్తమానాలు తెలియజేస్తూ, ప్రస్తుత సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలో చెబుతూ, విద్యార్థులకు మంచి బంగారు భవిష్యత్తుకు పూలదారి పరచాల్సిన భాద్యత కూడా ఒక్క ఉపాధ్యాయ వృత్తికే సాధ్యం. విద్యార్థులు తప్పులు చేస్తే దండిచడానికి తల్లిదండ్రులు ఉంటే ఆ తప్పులను సరిదిద్ది ఇది తప్పు... ఇది ఒప్పు అంటూ మంచి మాటలతో సన్మార్గంలో నడిపించే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడు. తన సొంత బిడ్డలు మాదిరిగానే పాఠశాలకు వచ్చే విద్యార్థులను సైతం బిడ్డలుగా భావించి విద్యాబుద్దులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు(కొందరు) నేడు ఆ ఉపాధ్యాయ వృత్తికే కలంకం తీసుకొస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట కొందరు ఉపాధ్యాయులు విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్న వార్తలను వింటూనే ఉంటాం. విద్యార్థులకు వెన్నంటే ఉండి, వారి ఎదుగుదలలో తోడుగా ఉండి, వారి భవిష్యత్తును బంగారుమయం చేయడానికి కృషి చేయాల్సిన ఉపాధ్యాయులు(కొందరు) వారిలోని కీచకపర్వాన్ని బయటకు తీస్తూ విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ విద్యార్థినీల చిధిమేస్తున్నారు. అలాంటి ఒక కీచకోపాధ్యాయుడి గురించి ఇప్పుడు మనం చదువుకుందాం. నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గం, ప్యాపిలి మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సామాజికశాస్త్రం (సోషల్ సబ్జెక్ట్) ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, గౌరవప్రదమైన యుటిఎఫ్ యూనియన్‌లో నాయకుడిగా ఉన్న బొజ్జన్న తనలోని కీచకోపాధ్యాయుడి పాత్రను బయటకు తీసి విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన చోటుచేసుకుంది.

ఇక వివరాలలోకి వెళితే..ఏనుగుమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు సాంఘీక శాస్త్రాన్ని భోదించే ఉపాధ్యాయుడు బొజ్జన్న పాఠశాలకు వచ్చి 9, 10వ తరగతి విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. విద్యార్థినీలకు యూటూబ్ నందు జుగుబ్జకరమైన వీడియోలు చూపిస్తూ ప్రతిరోజు ఇబ్బందులకు గురిచేసేవాడని విద్యార్థినీలు వాపోయారు. కులాల వారిగానే కాకుండా విద్యార్థినీలలో తెల్లగా ఉన్నవారిని ఒక వైపు, నల్లగా ఉన్నవారిని మరోవైపు కూర్చోబెట్టే వారని, ఎక్కడపడితే అక్కడ మాపై చేతులు వేస్తూ మమ్మల్ని ఇబ్బంది పెట్టేవారని, నోటికి వచ్చినట్లు అసభ్యపదజాలంతో తిట్టేవాడని విద్యార్థినీలు ఆరోపించారు. దీంతో విద్యార్థినీలు ఉపాధ్యాయుడి ఆగడాలను భరించలేక మా తల్లిదండ్రులకు చెప్పడం జరిగిందన్నారు. దీంతో తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేయడానికి సిద్దమై గురువారం పాఠశాలకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సమాచారం అందుకున్న సదరు ఉపాధ్యాయుడు బొజ్జన్న పాఠశాలకు రాకుండా పరారైయ్యాడు. అక్కడకు వచ్చిన పాఠశాల


ఆవేదన వ్యక్తం చేస్తున్న విద్యార్థినీలు

హెచ్‌ఎం వెంకటేశ్వర్లుతో విద్యార్థినీల తల్లిదండ్రులు గొడవకు దిగారు. గొడవ కాస్తా పెద్దది కావడంతో ప్యాపిలి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**ఉపాధ్యాయినీలకు తప్పని కీచకుడి ప్రవర్తన :** విద్యార్థినీలతో పాటు తోటి మహిళా ఉపాధ్యాయినీలను సైతం సదరు కీచకోపాధ్యాయుడు వదలలేదు. వారిపై పరోక్షంగా మాటలు సందిస్తూ, వారిపై పాటలు పాడుతూ వారిని కూడా వదలలేదని సమాచారం. తోటి ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కూడా ఉపాధ్యాయినీలపై కూడా తన కీచకత్వాన్ని ప్రదర్శించేవాడని విమర్శలు ఉన్నాయి.

**హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశాం పట్టించుకోలేదు.. రషీదాభాను, 9వ తరగతి, కొత్తకోట గ్రామం :** తమపై ఉపాధ్యాయుడు బొజ్జన్న అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని గతంలో హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశాం. అయినా కూడా కేవలం మందలించారే తప్పా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మేము ఫిర్యాదు చేసినప్పుడే కఠినచర్యలు తీసుకొని ఉంటే ఇంతవరకు వచ్చేదికాదు. పాఠశాలకు రావాలంటే భయంగా ఉండేది, చెప్పుకోలేని విధంగా మాతో ఉపాద్యాయుడు బొజ్జన్న అసహ్యంగా ప్రవర్తించేవాడు. చదవుపై దృష్టి సారించలేకపోయే వాళ్ళం, ఇబ్బందులు పడేవాళ్ళం.


రషీదాభాను, 9వ తరగతి


వైష్ణవీ, 9వ తరగతి

**బొజ్జన్న క్లాసుకు వస్తే భయం వేసేది..వైష్ణవి, 9వ తరగతి, మెట్టుపల్లి గ్రామం :** సోషల్ సబ్జెక్ట్ చెప్పడానికి బొజ్జన్న సార్ క్లాస్‌కు వస్తున్నారంటే తరగతి గదిలోని ఆడపిల్లలందరం భయంతో ఉండేవాళ్ళం.ఎక్కడచెయ్యి వేస్తాడో, ఎలా ప్రవర్తిస్తాడో అన్న భయంతో ఉండేవాళ్ళం.చిన్న పిల్లలం,అందులో ఆడ పిల్లలం అని చూడకుండా ఇష్టానుసారంగా నోటికి వచ్చి నట్లు తిట్టేవారు. పాఠాలలో ఏవైనా ప్రశ్నలు అడుగు దామంటే దగ్గరకు పిలిచి ఏమి చేస్తాడో అనే భయం ఉండేది. ఎక్కడ పడితే అక్కడ, చెప్పు కోలేని చోట మాపై చేతులు వేసేవారు. ఇలాంటి ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించండి.

**ఉపాధ్యాయుడు బొజ్జన్న సస్పెండ్ :** విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు బొజ్జన్నను సస్పెండ్ చేసినట్లు, అతనిపై అనేక ఆరోపణలు ఉన్న నేపధ్యంలో ఏనుగుమర్రి జడ్పిహెచ్‌ఎస్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి ఇచ్చినటువంటి నివేదికల ఆధారంగా ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ ఉపాధ్యాయుడు బొజ్జన్నను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది.

# ముగిసిన కెమరూన్ 2కె25 ఇంటర్నేషనల్ ఫెస్ట్



కెమరూన్ ఫెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న కెమరూన్ -2కె25 పేరుతో జాతీయస్థాయి ఐటీ మీట్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించిన ఫెస్ట్ గురువారం ముగిసినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డిలు తెలిపారు. ఈకార్యక్రమానికి కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బయ్య, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, హెడ్ ఆఫ్‌ది కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ కుమార్, కన్వీనర్స్ వెంకటరావు, దివ్యలతలు పాల్గొన్నారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నార. జమ్మలమడుగు సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్న ఈకెమరూన్ ఫెస్ట్‌లో అనుభవాలను పంచుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకోవడం చాలా అవసరం ఇప్పుడు మన విద్యాసంస్థల్లో చాలా మార్పులు వస్తున్న వాటిని మనం గమనించాలన్నారు. మనదేశంలో ఇప్పటికే నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అనే పేరుతో విద్యాసంవత్సరంలో ఒక మార్పును ప్రవేశపెడుతున్నారు. 2047 సంవత్సరానికి మన దేశం వచ్చి 100సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ కామెరూన్ ఫెస్ట్ వల్ల కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. కన్వీనర్ వెంకటరావు మాట్లాడుతూ మీ ప్రతిభను చూపించడానికి ఇది ఒక వేదిక అన్నారు. అనంతరం కోడ్ క్వెస్ట్, టెక్నికల్ క్విజ్ తదితర పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు.

# ఎడమ కాల్వను పొడిగించి సాగు, త్రాగునీరు అందించాలి

– సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య




**పత్తికొండ, మేజర్ న్యూస్ :** పందికోన రిజర్వాయర్ కింద ఉన్న ఎడమ కాల్వను పొడగించి సాగు, తాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పందికోన రిజర్వాయర్ కింద ఉన్న కుడి కాల్వ ద్వారా దేవనకొండ మండలంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఎడమ కాల్వ ద్వారా పత్తికొండ మండలంలో కేవలం 12వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించేందుకు రూపకల్పన చేయడం జరిగిందని, ఈ ప్రాంత రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఎడమ కాల్వను హోసూరు, పెద్దహుల్తి పొలాల మీదుగా చిన్న హుల్తి, దేవనబండ, అటికెల గుండు, నలకదొడ్డి, జూటూరు, బిల్లేకల్, వెంగళాయదొడ్డి వరకు పొడగించి పనులను పూర్తి చేసినట్లయితే వేలాది ఎకరాలకు సాగునీరు, ఆయా గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. సీపీఐ, ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21నుండి 27వరకు గ్రామాల్లో ప్రజలతో విస్తృతంగా సంతకాలు సేకరించి 28న గ్రామ సచివాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏపి రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాపతి, సురేంద్ర కుమార్, గౌరవ అధ్యక్షులు కారన్న, నాయకులు చదువుల కాశీనాథ్, రాజప్ప, నాగిరెడ్డి, లక్ష్మన్న, ఉరుకుంద, ఏంగిల్స్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పరీక్షల సందర్భంగా రోజు విడిచి రోజు ఉచితంగా బస్సు నడపాలి

– టీడీపీ మాజీ ఇంఛార్జీ




**ఆదోని, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు పరీక్షల సందర్భంగా , రోజు విడిచి రోజు స్కూలు బస్సు నడపాలని టీడీపీ మాజీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ, స్కూలు విద్యార్థి కోసం ఉచిత బస్సు నడిపే వారు గత పది రోజులకు విద్యార్థులు ఉదయం పూట హాస్టల్ నుండి దాదాపు రెండు కి.మీ., వరకు నడుచుకుంటూ పోతున్నారు. వేసవికాలం మధ్యాహ్నం 1.30 నిమిషాలకు ఆదోని ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ హైస్కూలు మధ్యాహ్నం 1.30 నిమిషాలకు బండిమిట్ట మధ్యాహ్నం నందు దాదాపుగా హైస్కూలు నుండి విక్టోరియా పేటలో ఉన్నటువంటి హాస్టల్ వరకు మండుటెండలో నడుచుకుంటూ వస్తున్నారు. స్కూలు బస్సును టైమింగ్ మార్చి ఉదయం 7.30 గంటలకు మరియు మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషాలక నడపాలని డిపో అధికారులను కోరుతున్నారు. అనంతరం డిపో మేనేజర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్, వీరేష్, రాఘవేంద్ర రెడ్డి, శీను,అల్తాఫ్, చిరంజీవి, నరసింహా, చంద్ర, సాబీర్ ఆలీ, సయ్యద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# రాంకో సిమెంట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ వారి ఆదేశాల మేరకు క్షయవ్యాధి నిర్మూలన దిశగా ప్రచారం కార్యక్రమంలో భాగంగా రాంకో సిమెంట్ యాజమాన్యం వారు గురువారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 206 మంది రోగులు వైద్య సేవలు వినియోగించుకున్నారు. రోగులకు రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్లు తెలిపారు. ఆరోగ్యంపట్ల తీసుకోవలసిన పలు జాగ్రత్తలను రోగులకు సూచించారు. వ్యాధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైన్స్ జి.ఎం అజ్మల్ అహ్మద్, మైన్స్ డీఎం నాయుడు, నరేష్, డాక్టర్ శశిధర్, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శిల నవచేతన శిక్షణ కార్యక్రమం

**అవుకుమేజర్,న్యూస్ :** అవుకు మండలంలోని గుండ్ల శింగవరం గ్రామంలోని హైస్కూల్‌లో అంగన్‌వాడి కార్యకర్తలకు పోషణభీ - పడాయిభీ కార్యక్రమం గురించి శిక్షణ ఇవ్వడమైనది. ఇందులో ముఖ్య భాగం అయిన ఆదర్శిల - నవచేతన కార్యక్రమం గురించి మొదటిరోజు శిక్షణ ఇవ్వడం జరిగింది.



అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

# మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి



చెత్త వాహనంతో నిరసన చేస్తున్న దృశ్యం

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో మొండి బకాయిలపై నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. కొంత కాలంగా వినూత్న కార్యక్రమాలతో పన్ను బకాయిదారులపై ఒత్తిడి తీసుకొస్తున్న అధికారులు తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో స్థానిక దేవనగర్‌లోని ఎంయస్9 లాడ్జ్ యాజమాన్యం గత ఏడేళ్లుగా రూ.3,31,250లు నగరపాలకకు ట్రేడ్ లైసెన్స్ రుసుములను చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో గురువారం సంబంధిత లాడ్జ్ ఎదుట అధికారులు చెత్త వాహనం నిలిపి నిరసన వ్యక్తం చేశారు. నగరపాలక నుండి ప్రయోజనాలు పొందుతూ పన్నులు చెల్లించకుండ ఉండటం తగదని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి నాగరాజు, తనిఖీదారుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశాజనకంగా పంట ఉత్పత్తుల ధరలు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** కర్నూలులోని వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన పంట ఉత్పత్తుల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. వాము క్వింటం ధర రూ.23,188లు పలికింది. కందులు క్వింటం ధర రూ.7,309లు కాగా ఎండు మిర్చి క్వింటం ధర రూ.12,600లు వచ్చింది. మిర్చి-5 రకం క్వింటం ధర రూ.12,800లు పలికింది. మిర్చి తాజా రకం రూ.10,749లకు వ్యాపారులు కొన్నారు. వేరుశనగ క్వింటం ధర రూ.6709లు పలికింది. ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తుంది.

# సబ్సిడీ రుణాలు ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలి

– రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర



**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం 2024-25కి గాను సబ్సిడీతో కూడిన రుణాలను వివిధ వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని లబ్ది పొందేందుకు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఆపైన డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉంటున్న 21సం॥ల నుండి 60సం॥ల వయసు లోపు వారికి కుల,ఆదాయ, నివాస, ఆధార్, రేషన్ వంటి ధృవీకరణ పత్రాలతో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. రూ.1లక్ష నుండి రూ.5లక్షల వరకు 40శాతం నుండి 50శాతం వరకు సబ్సిడీ అందిస్తుందని ఆయన తెలిపారు. జనరిక్ మందుల షాప్‌లకు రూ.8లక్షల వరకు 50శాతం సబ్సిడీతో కూడిన రుణాలను కూడా కార్పొరేషన్ ద్వారా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు గోకారి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు పూర్తి కావస్తున్నా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు గోకారి అన్నారు. గురువారం నగరంలోని ఎస్‌టియు భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గోకారి మాట్లాడుతూ జీవో నెంబర్ 17రద్దు అనంతరం ఏర్పాటు చేయబోయే అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతి వరకు తరగతులు నిర్వహించాలని, అన్ని ప్రాథమికోన్నత పాఠశాలలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. చిన్న చిన్న కారణాలతో పదవ తరగతి పరీక్షల సమయంలో సిఎస్, డిఓ, ఇన్‌విజిలేటర్లను సస్పెండ్ చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నెంబర్ 57ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, రాష్ట్ర మాజీ కార్యదర్శి మహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను విజయవంతం చేయండి




**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** మే 15నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగబోయే ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల ను విజయవంతం చేయాలని జాతీయ కార్యదర్శి లెనిన్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సిఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు వివిధ రాష్ట్రాల నుంచి 1000మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నట్లు వివరించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధి విధానాలపై సుదీర్ఘంగా మూడురోజుల పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శ్రీరాములు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి హొళగుంద పర్యటన కోసం
# చీఫ్ సెక్రటరీని కలిసిన నాయకులు

■ హొళగుంద,డణాపురం ప్రధాన రోడ్డుతో పాటు మండల అభివృద్ధికి వినతి


సూర్య ఎఫెక్ట్

హొళగుంద.. డణాపురం రోడ్డు మరమ్మత్తుకు గ్రహణం పట్టింది..

7లో

- ఆ గ్రహణాన్ని విడిపించి రోడ్డుకు మరమ్మత్తును చేయించే వారెవ్వరు..?
- అధ్వాన్నం.. ప్రయాణం నరకం.. ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం శూన్యం..
- గత ప్రభుత్వ హయాంలో డబల్ రోడ్డు నిర్మాణానికి రూ.60 కోట్ల నిధులు మంజూరు
- అప్పట్లో సదరు కాంట్రాక్టర్ రోడ్డు పనులను మొదలు పెట్టి వదిలేశారు..
- ఈ నిధులు రద్దు అయ్యాయని కొత్త నిధులు మంజూరు కావాలంటూ టెండర్ జరగాలంటున్న ఆర్అండ్‌బి అధికారులు

వర్ష కాలంలో కుంటలా తలపిస్తున్న రోడ్డు (ఫైల్ ఫోటో)

నరకయాతనంగా మారిన హొళగుంద డణాపురం ఆర్అండ్‌బి రోడ్డు

రోడ్డు సమస్యపై సూర్య దినపత్రిలో వచ్చిన క్లిఫింగ్‌లు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** ఆలూరు నియోజిక వర్గంలో అభివృద్ధికి ఆమడుదూరంలో ఉందంటే అది హొళగుంద మండలం సార్..కర్నూల్ జిల్లా కేంద్రానికి 135 కిలో మీటర్ల దూరంలో కర్ణాటక రాష్ట్రానికి అతి దగ్గరలో ఉన్న మండలాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారాచంద్రబాబునాయుడు ఒక్కసారీ పర్యటిస్తే మా మండలం పావనం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి విజయానందను తాలూక ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ, డిస్ట్రిబ్యూటరీ కమీటి ఛైర్మన్ మిక్కిలినేని వెంకట శివప్రసాద్,నాయకులు శ్రీనివాసరావు,బహుజన టైమ్స్ ఎండి దుర్గాప్రసాద్‌లు మర్యాద పూర్వక విజయవాడలో కలిసి విన్నమించారు.ఈ నెల 13వ తేదిన సూర్య దినపత్రికలో హొళగుంద డణాపురం రోడ్డు మరమ్మత్తుకు గ్రహణం పట్టింది అన్న వార్తకు స్పందించిన నాయకులు రోడ్డు సమస్యతో పాటు మండల సమస్యలు,మండలాభివృద్ధి జరగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి హొళగుంద పర్యటనకు తమవంతుగా కృషి చేయాలని వారు చీఫ్ సెక్రటరీని విన్నమించారు.హొళగుంద మండలంలోని 17 గ్రామ పంచాయితీలు ఉన్నాయి..24 గ్రామాలు ఉన్నాయి.. కొన్ని గ్రామాల్లో మాత్రం తుంగభద్ర దిగువ కాలువ ప్రవాహిస్తుందని,చాలా గ్రామాలు వర్షధారం మీద రైతులు ఆధారం పడి ఉన్నారన్నారు.ఒకసారీ అతివృష్టి,మరో సారీ అనావృష్టితో మండల రైతులు ప్రతి ఏటా కష్టాలు, నష్టాల భాటలో మొగ్గతున్నారని చెప్పారు.రైతులకు సాగునీరు,ప్రజలకు తాగునీటిని అందించడానికి మండలంలోని ప్రాజెక్టులు లేవన్నారు.నిరుదోగ్య సమస్య చాలా వరకు ఉన్నప్పటికి ఉపాధికి పరిశ్రమలు లేవన్నారు.మండలంలో దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి,ఎల్లార్తి గ్రామంలో ప్రసిద్ధ తాతల దర్గాలు ఉన్నాయని పర్యటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు.చెప్పుకుంటు పోతే ఒకట రెండా మండలంలోని ప్రతి గ్రామాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని వెనకబడిన మండలానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటిస్తే నెలకొన్న ప్రతి సమస్యలు తీరుతాయని వారు చీఫ్ సెక్రటరీతో విశ్వాసం వ్యక్తం చేశారు.ఎందుకంటే భారత దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ళ గడిచినా మండల సమస్యలు ఎక్కడ వేసినా గొంగళ్ళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు.స్పందిన ఆయన హొళగుంద మండల సమస్యలపై ఇచ్చిన విన్నపాన్ని పరిశీలించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని చీఫ్ సెక్రటరీ చెప్పారని వారు తెలిపారు.


రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు బోకేను ఇస్తున్న ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ

## ఉప ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయాలి

– పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి



**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ఈ నెల 22న శనివారం ఓర్వకల్లు మండలం పుడిచర్ల గ్రామంలో ఫారంఫండ్స్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనను నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మాధవినగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెదేపా,జనసేన,బిజెపి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు చింత సురేష్‌బాబు, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి రామాంజనేయులు, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కె పార్వతమ్మ, రవీంద్ర విద్యా సంస్థల అధినేత సుబ్బయ్య, కల్లూరు మాజీ ఎంపిపి మదేశ్,తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్,మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ యన్వి రామకృష్ణ, ఓర్వకల్లు మండల కన్వినర్ గోవింద్‌రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ తండ్రి నాగన్నను పరామర్శించిన ఆదిమూలపు సతీష్



**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల గ్రామానికి చెందిన సర్పంచ్ విద్యాసాగర్ తండ్రి నాగన్న అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని నాయకులు,మాజీ మండల ఉపాధ్యక్షులు డి వాసు ద్వారా సమాచారం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ గురువారం ఆసుపత్రికి వెళ్లి నాగన్నను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లను కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి జాగ్రత్తగా చూసుకోవాలని వారికి సూచించారు.

## అర్‌ఎంపి వైద్యులు
# ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి



**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలం లో గూళ్యం తో పాటు పలు గ్రామాలలో ఆర్ ఎం పి లు ఇంజక్షన్, సెలైన్ వంటి వాటివి ప్రజలకు ఇవ్వరాదని కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని డిప్యూటీ డిఎం హెచ్ ఓ రఘురామిరెడ్డి సూచించారు. గురువారం గూళ్యం, హాలహర్వి గ్రామాల్లో వైద్యులు మన్సూర్ వలి, తిమ్మన్న ల ఆధ్వర్యంలో పలు ఆర్ ఎంపి కేంద్రా లను తనిఖీ చేసి వారికి నోటీసులు అందించారు. ప్రజలకు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని అలా కాకుండా సెలైన్ లాంటివి ఉపయోగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో డిప్యూటీ డిఎం హెచ్ ఓ వస్తున్నారన్న సమాచారం తో ఆర్ ఎం పి లు అందరూ తమ క్లినిక్ లకు తాళాలు వేసినట్లు తెలిసింది. అలాగే ప్రాథమిక చికిత్స చేయాలన్న అర్హత సర్టిఫికేట్ ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ ఓ ఆదినారాయణ,సూపర్ వైజర్ కోకిల అబ్రహం,హెల్త్ అసిస్టెంట్ అరుణా భాయి, జయమ్మ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిని ఉద్యోగం నుండి తొలగించాలి

**ఎస్సి, ఎస్టీ, బీసి, మైనారిటీ విద్యార్థి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌సాయి**

**డోన్, మేజర్‌న్యూస్:** విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు బొజ్జన్నను ఉద్యోగం నుండి తొలగించాలని ఎస్సి, ఎస్టీ, బీసి, మైనారిటీ విద్యార్థి ఐక్యవేధిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌సాయి అధికారులకు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ ప్యాపిలి మండల పరిధిలోని ఏనుగుమర్రి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్రం బోదించే బొజ్జన్న అనే ఉపాధ్యాయుడు గత రెండు సంవత్సరాల నుండి విద్యార్థినీల పట్ల అసభ్యకరమైన పదజాలం వాడుతూ, యూట్యూబ్‌లో వీడియోలు చూపిస్తూ, విద్యార్థినీలను ముట్టకూడనిచోట తాకుతూ, 9, 10వ తరగతుల అమ్మాయిలను టార్గెట్ చేస్తూ బూతులు తిడుతూ తరగతి గదిలో తెల్లగా ఉన్న అమ్మాయిలను ఒక వైపు, నల్లగా ఉన్న అమ్మాయిలను మరోవైపు మరియు కులాల వారిగా కూర్చోబెడుతూ అమ్మాయిలను చిన్నచూపుతో మాట్లాడటం ఉపాధ్యాయ వృత్తికే సిగ్గుచేటన్నారు. కావున ఇటువంటి ఉపాధ్యాయుడిని తక్షణమే ఉద్యోగం నుండి తొలగించి, ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** బిర్లాగడ్డ మసీదులో ఉపవాసం దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు జిఎన్ఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య గురువారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్బంగా డాక్టర్ నాగేశ్వరయ్య మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని ఇలాంటి పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ,డ్యూటీ డాక్టర్ నాగేంద్ర, జిఎన్ఆర్ మెయింటెనెన్స్ ఇంచార్జ్ కుమార్,మేనేజర్ శివ,ల్యాబ్ టెక్నీషియన్ నరసింహ,పొడిచెర్ల బాష, తిమ్మప్ప, బాష, కలీల్,ఆరోగ్య మిత్ర అయూబ్,సిబ్బంది పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ఓర్వకల్లు మండల పరిశ్రమల్లో స్థానిక యువతకు 75శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతుసంఘం మండల కార్యదర్శి రమేష్, రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్,ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్నలు డిమాండ్ చేశారు. గురువారం మండల ప్రజా సంఘాల కార్యాలయం నందు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రైతు సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్థానిక యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము,హుస్సేన్ తదితరులున్నారు.




## శ్రీచెన్నకేశవస్వామి భూములకు కౌలు వేలం



**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్యాపిలి పట్టణంలోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానంకు సంబందించిన భూములకు కౌలు వేలం పాటలను నిర్వహించినట్లు ఈఓ టి.హనుమంతరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో ఈఓ హనుమంతరావు ఆధ్వర్యంలో చేపట్టిన సర్వేనెంబర్–179లోని 13.19 ఎకరాల భూముల కౌలు వేలం పాటను జె.లక్ష్మిదేవి రూ.11,500లకు వేలం దక్కించుకున్నారు. అదేవిధంగా సర్వే నెంబర్లు – 539, 436, 548, 607 భూములకు సంబందించి వేలం పాటకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో వేలం పాటను నిలుపుదల చేసినట్లు ఈఓ హనుమంతరావు తెలిపారు.

**శ్రీలక్ష్మినరసింహస్వామి భూముల వేలం పాట వాయిదా :** మండల పరిధిలోని ఓబుళదేవరపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబందించిన 61 ఎకరాల భూముల కౌలు వేలం పాటకు గ్రామ ప్రజలు అందుబాటులో లేకపోవడంతో వేలం పాట వాయిదా వేసినట్లు ఈఓ హనుమంతరావు తెలిపారు. దేవదాయశాఖ సిబ్బంది వెంకటేశ్వర్లు, మద్దిలేటి, ప్యాపిలి, ఓబుళదేవరపల్లి గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

సూర్య



# మండల కమిటీల నియామకం పట్ల హర్షం

**మండల ఉపాధ్యక్షుడు అల్లబకాష్, కమిటీ సభ్యులను సన్మానించిన వైఎస్సార్సీపీ నాయకులు**



**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** ఇటీవల వైఎస్సార్సీపీలో మండల కమిటీల జాబితాలను పార్టీ కార్యాలయం విడుదల చేసింది. మండల కమిటీ లో నియామితులైన వారి పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల ఉపాధ్యక్షుడిగా పేట అల్లాబకాష్, జనరల్ సెక్రటరీలుగా కురువ పెద్ద లింగన్న, బోయ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గోల్ల నరసింహుడు, నూకల వెంకటేష్, కందాల మల్లేష్లను నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించడంతో గురువారం మండల కేంద్రంగోనెగండ్లలో వైఎస్సార్సీపీ జిల్లా ఆక్టివిటికార్యదర్శిటీ. నాగేష్ నాయుడు, నాయకులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీలో నియామకమైన వారు మాట్లాడుతూ తమకు పార్టీలో మండల కమిటీ లో పదవిని కల్పించడం ఆనందంగా ఉందని, పార్టీలో ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వైఎస్సార్సీపీ జిల్లా ఆకివిటి కార్యదర్శి టీ. నగేష్ నాయుడు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీలో నియామకమైన వారు మాట్లాడుతూ తమకు పార్టీలో మండల కమిటీ లో పదవిని కల్పించడం ఆనందంగా ఉందని, పార్టీలో ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటామన్నారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వైఎస్సార్సీపీ జిల్లా ఆక్టివిటి కార్యదర్శి టీ. నాగేష్ నాయుడుతో పాటు మండల కమిటీలో ఎన్నికైన వారిని పార్టీ నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాయప్ప, వైఎస్సార్సీపీ నాయకులు రవి కుమార్ నాయుడు, తోలు రాముడు, దుబ్బన్న, మల్లి, ఊసేన్ పటేల్, రామయ్య, అచ్చుకట్ల చాంద్, కురువ లింగన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా శివ ప్రసాద్

**బాధ్యతలు స్వీకరించిన శివ ప్రసాద్**
**శుభాకాంక్షలు తెలిపిన యస్. ఆర్.బి సి. డివిజన్ 2 కార్యాలయ సిబ్బంది**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** ప్రభుత్వం జారీ చేసినపదోన్నతిఉత్తర్వులలోభాగంగా హెచ్. యన్. యస్. యస్. డివిజన్ నెం. 4, కర్నూలులో డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తూపదోన్నతి పై యస్. ఆర్. బి. సి. డివిజన్ నెం. 2, పాణ్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గా గురువారం భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాయలసీమకు తలమానికంగా ఉన్నటువంటి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సంబందించి రావలసిన అనుమతులు త్వరితగతిన మంజూరు కొరకు కృషి చేస్తానని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి ప్రస్తుత ప్రభుత్వం సారధ్యంలో పనులు వేగవంతం చేయడానికి అన్ని విధాలుగా అధికారులతో మరియు ప్రభుత్వంతో సమన్వయం చేసుకొనిముందుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు వేంకటేశ్వర రెడ్డి, సత్య విజయ కుమార్, మల్లిఖార్జున రెడ్డి, రాజశేఖర్, నాగభూషణం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరియు కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌లు నాగేంద్రప్ప, నాగరాజు, అక్బర్ ఖాన్, రామేశ్వరమ్మ, జగదీష్, టెక్నికల్ ఆఫీసర్ నాగరాజు మరియు కార్యాలయ సిబ్బంది ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివ ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# అంగన్వాడీలకు పోషన్ భీ - పడాయి భీ శిక్షణా కార్యక్రమం

**-: అనారోగ్యం పిల్లలను ఎన్ ఆర్ సి కి పంపాలి**
**-: అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** పట్టణ ,గ్రామీణ ప్రాంతాలలోని అంగన్వాడి కేంద్రాలలో అనారోగ్యంగా ఉన్న చిన్నారులను ఎన్ ఆర్ సి కి పంపాలని నందికొట్కూరు సిడిపిఓ కోటేశ్వరి అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం పట్టణంలోని అల్లూరు రోడ్ లో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్ భీ – పడాయి భీ శిక్షణా కార్యక్రమం ఐ సి డి ఎస్ పట్టణ ,రూరల్ గ్రామీణ ప్రాంతాల సూపర్వైజర్లు ఆశీర్వాదమ్మ , వెంకటేశ్వరమ్మ, అనురాధల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ 0 నుండి 3 సంవత్సరాల లోపు ఏ విధంగా అభివృద్ధి చెందుతారో నవ చేతన్ లో తెలుసుకోవచ్చని అంతేగాక ప్రీ స్కూల్ నందు పిల్లలో అభివృద్ధి మరియు తల్లి బిడ్డల పోషణ మరియు ఆరోగ్యం గురించి , కుటుంబాలలో అవగాహనా కలిగించి తల్లి బిడ్డల సంక్షేమల పై జాగ్రత్తలు తీసుకోవడం మరియు ఆధార్ శీలలో 3నుండి 6సం,,ల పిల్లలో పెరుగుదల పర్యవేక్షణలో వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు రెండు ఉండాలి అప్పుడే పిల్లలో అన్ని రకాల అభివృద్దులు జరుగుతాయి అన్నారు .అనారోగ్యంగ ఉన్న పిల్లల్ని పునర్వాస కేంద్రాలకు పంపించాలని దీంతో కుటుంబానికి, సమాజానికి మంచి ఆరోగ్యావంతమైన బిడ్డలను అందజేయాలని తల్లులకు కూడ వీటిపై అవగాహన కల్పించాలని డిజిటల్ ప్యానల్ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు.

# అసంపూర్తిగా భవన నిర్మాణాలు

(మొదటిపేజి తరువాయి..)

ఆగిపోయాయి.పిల్లర్ల వరకు పనులు చేసి వదిలేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవననిర్మాణ పనులుముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలో విద్యార్థులు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా పనులు చేయకుండా నిలిపి వేశారు. ముత్యాలపాడులో మూడు ఆదనపు గదులకు రూ. 11.61 లక్షలు, గొడిగ నూరులో మూడు భవనాలకు రూ. 14.74లక్షలు, మద్దూరులో మూడు భవనాలకు రూ. 53 లక్షలు, బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ. 36.45 లక్షలు, బాలి కోన్నత పాఠశాలకు నాలుగు భవనాలకు రూ. 49.88 లక్షలు, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ. 30.20 లక్ష లు, కస్తూర్బా పాఠశాలకు రూ3.49 లక్షలు ఖర్చు చేశారు. నిధులు లేక పోవడంతో పాఠశాలలో పనులు అర్ధాంతరంగా నిలిపి వేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేయకుండా నిలిపివేశామని హెచ్ఎంలు, కమిటీ లు చెబుతున్నారు. మంజూరైన నిధుల వరకు పనులు చేశామని అన్నారు. ఇకమీదట డబ్బులు మంజూరైతేనే పనులు చేస్తామంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడును తొలగించి మనబడి మనభవిష్యత్తుగా మార్చింది. ఈ పథకంతోనైన అసంపూర్తిగా ఉన్న భవన పనులను పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఎంఈవో అనూరాధను వివరణ కోరగా గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని తెలిపారు. మంజూరైన 15 శాతం బిల్లుల వరకు పనులు చేసి వదిలేశారని చెప్పారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు పాఠశాల భవనాల పనులు గురించి ప్రతిపాదనలు చేయాలని ఆదేశించడంతో అసంపూర్తిగా ఉన్న భవన పనుల వి వరాలను ఉన్నతాధికారులకు నివేదించామని అన్నారు.



చిన్నవంగలిలో పిల్లర్లకే పరిమితమైన పాఠశాల భవన పనులు

# బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా శివరామిరెడ్డి నామినేషన్ దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న శివరామిరెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది సి. శివరామిరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బార్ అసోసియేషన్ కాల పరిమితి ముగియడంతో తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మహబూబ్ బాషా, ఆర్ శ్రీనాథ్ రెడ్డి, సోమ శేఖర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, గౌస్ పీర్, జనార్ధన్, మరియు మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గాలో పనులు ప్రారంభం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :**



పనులను పరిశీలిస్తున్న మైనార్టీ నాయకులు

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈద్గాలో మరమ్మత్తు పనులు ప్రారంభమయ్యాయని టీడీపి మైనారిటీ నాయకులు హుసేన్ పీరా, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహమ్మద్, షాబీర్, సలీమ్‌లు పేర్కొన్నారు. గురువారం వారు ఈద్గాలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ సందర్భంగా ఈద్ నమాజ్ కు ఈద్గాకు వచ్చే ప్రతి ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారని తెలిపారు. తాగునీటి, ఇతర సౌకర్యాలు ఏర్పాటు అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి-ఈఓఆర్డి



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం సంగాల గ్రామంలో డెంగ్యూ జ్వరం బాధిత కుటుంబాన్ని గుర్తించారు. కోడుమూరు నియోజకవర్గ స్థాయి మలేరియా అధికారి రంగస్వామి మండల ఈఓఆర్డి ఈశ్వరయ్యస్వామితో కలసి సంగాల గ్రామంలో పర్యటించారు. గ్రామంలో డెంగీ జ్వరం బాధిత కుటుంబాన్ని గుర్తించి బాధిత ఇంటిలో వైద్యుల సూచన మేరకు వ్యాధి తీవ్రత పెరగకుండా స్ప్రే చేయడం, ఆకుటుంబాన్నికి తగు జాగ్రత్తలు సూచనలు ఇవ్వడం జరిగింది.అదేవిదంగా గ్రామంలో మురికి కాలువలను సుబ్రపరచి అందులో స్ప్రే చేయడం జరిగింది.మలేరియా అధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగాఉండాలని ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజి కాలువలు, రోడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని బ్లీచింగ్ పౌడర్ తో క్లోరినేషన్ చేయాలన్ని ఈఓఆర్డి. ఈశ్వరయ్య స్వామి అన్నారు.ఈ కార్యక్రమంలో మలేరియా అధికారి రంగస్వామి, ఈఓఆర్డి. ఈశ్వరయ్య స్వామి, గ్రామ సర్పంచ్ బి.హనుమంతు, గ్రామ సచివాలయం హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయాన్ని ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

**పి-4 సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి**



సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని సచివాలయం మిడుతూరు2. ను ఎంపీడీవో దశరథ రామయ్య ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని పి4 సర్వేను సరిత గతంలో పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.పేదరిక నిర్మూలనలో భాగంగా దిగువస్థాయి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకుసంకల్పించినరాష్ట్రప్రభుత్వంవాటిగుర్తింపుకోసంసర్వే గురువారం నుంచీ ప్రారంభించింది. సచివాలయ ఉద్యోగులు పీ4 సర్వేలో పాల్గొంటున్నారు. తమ క్లస్టర్‌లోని కుటుంబాలకు సంబంధించిన 27 రకాల ప్రశ్నల్ని నింపాల్సి ఉంటుంది.వారిలాగిన్‌లో ఆయా కుటుంబాల వివరాలు ఉంటాయి.ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులు న్నారా? కరెంటు, నీళ్ల కనెక్షన్స్ ఉన్నాయా? సెల్‌ఫోన్ ఉందా? రేషన్‌కార్డు ఉందా?.. ఇలా అనేక రకాల ప్రశ్నలకు సమాధానాలను నింపుతారు. ఆ ఇంటి సభ్యుడి బయోమెట్రిక్ లేదా ఓటీపీ ద్వారా ఈ సర్వే పూర్తి చేస్తారు.మొత్తం సర్వేని పది రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది అని ఎంపీడీవో సిబ్బందికి సూచించారు.

# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

**గడివేముల, మేజర్ న్యూస్ :**



గడివేముల మండలంలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సి మారెన్న గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఒంటిపుట బడులు కావడంతో ఉదయం పాఠశాలకు హాజరై విధులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలి మరణించారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలియజేశారు.

## నోటి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ శాఖ వారి ఆధ్వర్యంలోశ్రీలక్ష్మీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు నోటి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే ప్రపంచ పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకొని పర్యావరణంలో ఊరపిచ్చుకల ప్రాధాన్యత గురించి నంద్యాల దంత వైద్యులు డా.కె. కిషోర్ కుమార్,డా"సి.గురుప్రసాద్, డా"వి. వరుణ్ కుమార్ రెడ్డి,డా"సూర్య ప్రకాష్ లు వివరించారు.విద్యార్థులకు పక్షుల బొమ్మల చిత్రీకరణ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. వేసవిలో ఇంటి పరిసరాల్లో పక్షుల కొరకు నీటి తొట్టెలను ఉంచాలని వారు విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మీ , కరెస్పాండెంట్ గోవర్ధన రెడ్డి పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయలను ప్రజలు వెంటనే చెల్లించాలి..



కమిషనర్ కిషోర్

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్ళగడ్డ పురపాలక సంఘ పరిధిలోని ఇళ్లు ,షాపింగ్ మాల్స్, ఖాళీ స్థలాలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలను ఈ నెలాఖరు లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో పన్ను చెల్లింపుల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజల సకాలంలో ఇంటి పన్ను కొళాయి పన్ను బిల్లులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కిశోర్ విజ్ఞప్తి చేశారు.

### జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలతో ఓబులంపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



డాక్టర్ అశోక్

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** జాతీయ నాణ్యతహామీ ప్రమాణాల కార్యక్రమం కింద ఓబులంపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ క్వాలిటీ ప్రమాణాలతో నిలవడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఎన్ క్యు ఏ ఎస్ కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్ చేపట్టిన సర్వేలో ఓబులంపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం 84.5% క్వాలిటీ ప్రమాణాలతో ముందంజలో నిలబడింది. క్వాలిటీ ప్రమాణాలను నిలబెట్టిన డాక్టర్ అశోక్ కుమార్ ను అభినందిస్తున్నామని ఎన్ఆర్ఐ, మండల టిడిపి నాయకులు గౌరు రామకృష్ణారెడ్డి అన్నారు. గ్రామ ప్రజలతో మమేకమై పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న మీరు అభినందనీయులు అన్నారు. అలాగే శోభమ్మ కాలనీలోని ప్రభుత్వ భవనాల కు వెళ్లేందుకు రహదారుల ఏర్పాటు అభివృద్ధి కోసం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సహకారంతో పనులు పూర్తి చేస్తామని రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు.

## ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలో తహసిల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో రాజకీయ నాయకులతో ఓటర్ల అంశంపై సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఓట్లు మార్పులు ,చేర్పులు కొత్త ఓటర్లు చేరడానికి ప్రస్తుతం అవకాశం ఉందని, కొత్తగా పెళ్లయిన వారు ఓటు హక్కు దరఖాస్తు కోసం స్థానిక బిఎల్ఓ లను సంప్రదించాలని కోరారు. ఓటు హక్కు, పోలింగ్ బూత్లపై పలు అవగాహన సూచనలు తెలిపారు. ప్రతినెల మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీలతో సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వీరేంద్ర గౌడ్, రాజకీయ పార్టీల నాయకులు నరసప్ప, వీరేష్ యాదవ్, శివకుమార్, గోవిందు, కేశన్న, విరుపాక్షి రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

## కేజీవీబీలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

**మిడుతూరుమేజర్ న్యూస్ :** మిడుతూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి వెల్లడించారు.మార్చి22వ తేదీ నుంచి ఈ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఈ విద్య సంవత్సరానికిగాను 6, 11 తరగతల్లో ప్రవేశాల కోసం అలాగే 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. ఈ ప్రవేశ పరీక్ష దరఖాస్తులు మార్చి 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని ప్రిన్సిపల్ విజయలక్ష్మిపేర్కొన్నారు.

## ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసిన డిప్యూటీ డియం అండ్ హెచ్ ఓ



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని ఖిబులా కాలనీలో ఉన్న ఆరోగ్య కేంద్రంను డిప్యూటీ డియం హెచ్ ఓ డాక్టర్ సత్యవతి గురువారం తనిఖీ చేశారు. గర్భవతులులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో సేవలంచాలని సూచించారు. రక్తపోటు, మధు మేహం క్యాన్సర్ సర్వే త్వరగా పూర్తీ చేయాల న్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైదులు, విజయ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యకొండలో డెంగ్యూ కేసు నమోదు

**-రెండు మాసాలలో 11 డెంగ్యూ కేసులు నమోదు**



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండలంలో డెంగ్యూ వ్యాధి కేసులు గత కొన్ని రోజులుగా పెరుగుతున్నాయి.గురువారం అయ్యకొండ గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికకు డెంగ్యూ వ్యాధి సోకిందని ఈ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ కోరారు. గురువారం అయ్యకొండ గ్రామంలో ఆయన, వైద్యశాఖ సిబ్బంది, ఎంపీడీవో మణిమంజరి పర్యటించారు. గ్రామంలో 8 ఏళ్ల బాలుడికి డెంగ్యూ సోకడంతో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో మణిమంజరి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు మురికి వాడలలో పర్యటించి అక్కడి వారికి ఆరోగ్యసూత్రలను వివరించారు. నిలువ ఉన్న నీటిని పరిశీలించారు. వీదుల్లో ఉన్న మురుగునీటినితొలగించాలని ఆదేశాలు జారీచేశారు. వైద్యశిబిరంలను ఏర్పాటు చేశారు. రోగులకు జ్వరం, దగ్గు, జలుబు, ఇతర వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులను అందజేశారు. వారు మాట్లాడుతూ దోమలు పెరగడం ద్వార మలేరియ, డెంగ్యూ, చికున్గున్యా వ్యాదులు ప్రభలుతాయాన్నారు. గత రెండు మాసాలలో మండలంలోని హెచ్.కైరవాడి, చిన్న మర్రివీడు. వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, గంజహళ్లి, అయ్యకొండ గ్రామాలలో పదకొండు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. నీరు నిలువ ఉన్న చోట ఆయిల్బాయిల్, ఎం ఎల్ఆయిల్ (స్ప్రెయింగ్ చేయించారు. డెంగ్యూ వ్యాధి సోకిన వారి ఇండ్లలో దోమలు ప్రభలకుండా మందును పిచికారి చేయాలన్నారు. ఇండ్ల పరిసరాలలో దోమలు ప్రభలకుండా పెరిత్రియం ద్రావణంను పిచికారి చేయించాలని వైద్యసిబ్బందికి సూచించారు. గ్రామంలోని పలు వీదులలో మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేయాలన్నారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అసుపత్రికి రావాలిని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు, హనుమంతు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు వైద్యఆరోగ్యసిబ్బంది, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

## వయోజనులకు అక్షరాస్యత కోసం 'ఉల్లాస్' కార్యక్రమం



**పాములపాడు, మేజర్ న్యూస్ :** వయోజనులకు అక్షరాస్యత కోసమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని వయోజన విద్య జిల్లా మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు గురువారం స్థానిక ధనలక్ష్మి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎఫ్ ఎల్ ఎన్ ఏ పరీక్షలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 23 తేదీ నుండి మండలంలో 950 మంది మహిళలకు వాలంటీర్ల ద్వారా విద్య బోధన చేయడం జరిగిందన్నారు వారందరికీ ఈనెల 23న ఆయా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు . చదవడం రాయడం లెక్కలు వేయడం ఈ మూడు అంశాలపై 150 మార్కులకు 17 మార్కులు సాధించిన వారికి ఎన్ ఎస్ఐఓ సమస్త ద్వారా ధ్రువీకరణ పత్రం ఇవ్వబడుతుందని వివరించారు ఈ కార్యక్రమంలో ఏపిఎం ఉమామహేశ్వరి సీసీలు సౌభాగ్య వెంకటరాముడు కృష్ణారెడ్డి నాగన్న విఓఏలు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో ముసలం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణంలోనే డీసీహెచ్ఎస్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డీసీహెచ్ఎస్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయాలను ఖాళీ చేయాలని కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సర్వజన ఆసుపత్రిగా మారిన తరువాత ఆ ప్రాంగణం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి వస్తుందని ఆ కార్యాలయాలు ఖాళీ చేయాలని కలెక్టర్ ఆ రెండు విభాగాల అధిపతులను మౌళికంగా ఆదేశించారు. మూడు శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.ఆ మూడు విభాగాలను పర్యవేక్షించే ప్రిన్సిపల్ సెక్రటరీ మౌళిక ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్ జిల్లా సర్వోన్నత అధికారికి ధరఖాస్తు చేయడంపై వైద్య, ఆరోగ్య శాఖలో దుమారాన్ని రేపుతున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది..

నంద్యాల జిల్లాగా మారి తరువాత జిల్లా కార్యాలయాలు జిల్లా కేంద్రంలో కొలవు తీరాయి. గత ప్రభుత్వం నంద్యాలకు మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మారింది. గతంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మొదటి అంతస్తులో డీసీహెచ్ఎస్ శాఖ విధులు నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలోని ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్‌లో డీఎం అండ్ హెచ్‌వో శాఖ విధులు నిర్వహిస్తోంది. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు ప్రాంగణంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ విభాగానికి స్థలం కేటాయించడంతో పబ్లిక్ హెల్త్ నిధుల నుంచి ఆ భవనాన్ని నిర్మించుకున్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని కార్యాలయాన్ని డీఎంఈ పరిధిలోకి వస్తాయని, వాటిని ఖాళీ చేయించాలని సూపరిండెంట్ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ఆ ,దరఖాస్తులో డీసీహెచ్ఎస్ విభాగం 7 రూములను వినియోగించుకున్నట్లు పొందుపరిచారు. వాస్తవానికి ఆ శాఖ మూడు రూమ్‌ల నుంచే విధులను నిర్వహిస్తోంది. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు స్టాక్ రూమ్, భర్త్ అండ్‌డెత్,ఏవో, ఏపీఎంఎస్ఐడీసీ స్టోర్ రూమ్‌లతో కలిపి డీసీహెచ్ఎస్ శాఖ ఆ విభాగం అధిపతి ఒక రూమ్‌తో పాటు కంప్యూటర్ మరియు సిబ్బందికి రెండు రూమ్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. ఇకపోతే డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతో పాటు ఆయుష్ విభాగం విధులు నిర్వహిస్తోంది. ఆయుష్ విభాగంలో ప్రభుత్వ ఆయుర్వేద, యునాని, హోమియో పతి వైద్య శాలలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖలో కీలకమైన డీసీహెచ్ఎస్, డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయాలు ఖాళీ చేయాలని సూపరింటెండెంట్ కోరుతున్నట్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. డీసీహెచ్ఎస్ కార్యాలయాన్ని పాణ్యం సీహెచ్‌సీ ప్రాంగణంలోకి మార్చుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఆ శాఖ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు అనుమతి కోరారు. ఇకపోతే డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం తమదేనని ఆ విభాగం చెబుతోంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని భవనాలన్నీ తమ పరిధిలోకి వస్తాయని సూపరింటెండెంట్ చెబుతుండటంతో ఆ శాఖపై పచ్చివెలక్కాయ పడ్డట్లు అయింది. భవన నిర్మాణానికి వెచ్చించిన నిధులు తమ శాఖవని చెప్పినా సూపరింటెండెంట్ వినకపోవడంతో తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక డీఎం అండ్ హెచ్‌వో శాఖకు ముందు గొయ్యి, వెనుక నుయ్యి అనే పరిస్థితిగా మారిపోయింది. వైద్య, ఆరోగ్య శాఖలో తలెత్తిన ముసలం రాబోయే రోజుల్లో ఏలాంటి పరిణామాలకు దారితిస్తోందో తెలియని పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జూమ్ మీటింగ్‌లో ఖాళీ అంశం చర్చకు వచ్చినప్పుడు ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రాంతంలోనే విధులు నిర్వహించాలని ఒకటికి రెండు సార్లు చెప్పినట్లు తెలుస్తోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాత్రం ఆ రెండు విభాగాలు విధులు నిర్వహిస్తున్న భవనాన్ని, రూమ్‌లను ఖాళీ చేయాలని కోరుతుండటం విశేషం.

# 6, 11వ తరగతుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కేజీబీవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ షకీరాబేగం**

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలనందు 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ షకీరాబేగం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అడ్మిషన్లు ఈనెల 22వ తేది నుండి ఏప్రిల్ 11వ తేది వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అనాథ పిల్లలు, బడి బయట పిల్లలు(బడి మానేసిన పిల్లలు), పేద ఎస్సి, ఎస్టి, బీసి, మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థినీలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. ఒకవేళ సమాచారం అందకపోతే పాఠశాలలోని నోటిఫికేషన్ బోర్డులో నేరుగా తెలుసుకోవచ్చున్నారు.

## సమాజసేవతోనే సంతృప్తి

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్



లోగోను ఆవిష్కరిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** సమాజ సేవతోనే సంతృప్తి కలుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. ప్రతి వ్యక్తీ తన సంపాదనలో కొంత శాతం సమాజ సేవకు వినియోగిస్తే దేశం పురోగతి సాధిస్తుందని ఆయన అన్నారు. నూతనంగా ప్రారంభించిన ఆయత్ ఫౌండేషన్ సేవా సంస్థ లోగోను తన నివాసంలో ఆవిష్కరించిన సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజాన్ని తన కుటుంబంలా భావించినప్పుడే ప్రగతి ఫలాలు అందుతాయని అన్నారు. పోలీసు శాఖలో విశేష సేవలు అందించిన రిటైర్డ్ డియస్పీ మహబూబ్ బాషా సమాజసేవా రంగంలోకి రావడం అభినందనీయమని అన్నారు. ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ ఒక మంచి సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో తాము ఈ సంస్థను ప్రారంభించామని అన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా రాబోయే తరాల కోసం ఒక వినూత్న ప్రణాళికతో తమ కార్యాచరణను రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆనందరావు, రామమోహన్ రెడ్డి, వెంకట్రాముడు, నాగేశ్వరబాబు, సూర్యకుమార్, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎస్వి మోహన్‌రెడ్డి


ఎస్వి మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న సలీంభాయ్

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి కార్యకర్త వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి అన్నారు. వైసిపి రాష్ట్ర మైనార్టీ సెక్రటరీగా ఎన్నికైన సలీం భాయ్ గురువారం ఎస్వి మోహన్‌రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షురాలు ఎస్వి విజయమనోహరిలను శాలువా,పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అప్పజెప్పిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త,నాయకులు విశేష కృషి చేయాలన్నారు. అనంతరం సలీంభాయ్ మాట్లాడుతూ కర్నూలు నగరం వైసిపి కంచుకోట అని ముస్లిం సామాజిక వర్గంలో ఎస్వి మోహన్‌రెడ్డికి తిరుగులేని ఆధిక్యత ఉందని ఆయన నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి తాము కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, సలీంభాయ్ మిత్ర బృందం పాల్గొన్నారు.

## కాంట్రాక్టు ఫార్మసీ ఉద్యోగాలకు తాత్కాలిక బ్రేక్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఆరోగ్య శాఖలోని కడప ఫోర్త్ జోన్ పరిధిలో కాంట్రాక్టు ఫార్మసీ ఉద్యోగ నియమాలకు సంబంధించిన ప్రక్రియ హైకోర్టు నుండి మధ్యంతర ఉత్తర్వులు రావడంతో ఉద్యోగాల నియామకానికి తాత్కాలికంగా బ్రేక్ పడిందని కోర్టు నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వేచి ఉండాలని కడప జోన్ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏదైనా అదనపు మార్గదర్శకాలు,తాజా సమాచారం అందిన వెంటనే అధికారికంగా తెలియజేస్తామని కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతికళ తెలిపారు.

# స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**ప్యాపిలి మండలంలోని ఏనుగుమర్రి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సాంఘిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్ బొజ్జన్నను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక విచారణలో వెల్లడైనందున ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విధుల నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడమే కాకుండా విద్యార్థుల పట్ల అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు మండల విద్యాశాఖ అధికారి, డిప్యూటీ విద్యాశాఖ అధికారి తమ నివేదికలో వెల్లడించినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు స్కూల్ అసిస్టెంట్ బొజ్జన్నపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు నివేదికలో తెలిపారన్నారు. పాఠశాల విద్యార్థినులను విచారించగా స్కూల్ అసిస్టెంట్ అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలియజేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. గతంలో పాఠశాల హెడ్మాస్టర్ స్కూల్ అసిస్టెంట్‌ను తన ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడం విచారకరమని నివేదికలో వెల్లడైనట్లు కలెక్టర్ తెలిపారు.


జిల్లా కలెక్టర్ రాజకుమారి

# దేవాలయం నిర్మాణం పై విచారణ

- జిల్లా కలెక్టర్‌కు పిటిషన్ ఇచ్చిన దళిత సామాజిక వర్గీయులు
- గ్రామంలో ప్రజల మధ్య వాగ్వాదం
- పోలీసుల రంగ ప్రవేశం



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న దేవాలయం నిర్మాణం పై జిల్లా దేవాదాయ శాఖ అధికారి మోహన్ గురువారం విచారణ చేపట్టారు గతంలో గ్రామానికి చెందిన కొందరు దళిత సామాజిక వర్గానికి చెందిన యువకులు చెన్నకేశవ స్వామి ఆలయం కాకుండా రామాలయం నిర్మాణం చేపడుతున్నారని చెన్నకేశవ స్వామి కి మాత్రమే మాన్య భూములు ఉన్నాయని రాములవారికి ఎలాంటి మాన్యం భూములు లేకున్నా ఆలయ నిర్మాణం చేపడుతున్నారని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు ఈ విషయంపై విచారణ చేపట్టేందుకు గ్రామానికి వచ్చామని తెలిపారు ఈ విషయంపై విచారణ సమయంలో హిందువులు అందరూ నిర్మించుకునే గుడి గురించి దళితులు ఎందుకు ప్రశ్నిస్తున్నారు అంటూ కొంతమేర మాటలు యుద్ధం చోటుచేసుకుంది దీంతో వాతావరణం ఉద్రేకంగా మారే పరిస్థితి నెలకొంది ఆత్మకూరు రూలర్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి పోలీసులతో రంగ ప్రవేశం చేశారు ప్రజలు గుంపులు గుంపులుగా లేకుండా చెదరగొట్టారు పోలీస్ స్టేషన్ వద్దకు ఫిర్యాదులుదారులు దేవదాయ శాఖ అధికారులు ఆలయ కమిటీ సభ్యులు రావాలని సూచించారు అక్కడే వేరువేరుగా మాట్లాడి విషయం తెలుసుకున్నారు సమస్య సర్దుమనిగేలా చేశారు ఆలయ నిర్మాణానికి 60 లక్షలు మంజూరు గ్రామంలో దేవాలయం నిర్మాణానికి 60 లక్షలు మంజూరు అయ్యా యని జిల్లా దేవాదాయ శాఖ అధికారి మోహన్ తెలిపారు ఆలయ ప్రాంగణంలో ఎన్ని స్వామి వారి విగ్రహాలైన ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న దేవాలయంలో సీతారాములు ఆంజనేయస్వామి వెంకటేశ్వర చెన్నకేశవ స్వామి విగ్రహాలు ప్రతిష్టిస్తామని అందుకు ప్రత్యేక గదులు నిర్మాణం చేపట్టడం జరిగిందని విచారణలో తేలిందన్నారు ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను త్వరలోనే అందజేసేందుకు చర్యలు తీసుకున్నందుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు ఈ విచారణకు గ్రామంలోని ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున వచ్చారు ఈ విచారణలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనార్ధన్ ఏఈ రవి కుమార్ రెడ్డి ఎండోమెంట్ సుబ్రహ్మణ్యం సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం పాదయాత్ర భక్తులకు అన్నదానం



**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని బుదూరు గ్రామస్థులు కర్ణాటక నుంచి శ్రీశైలంకు పాదయాత్ర వెళ్లే భక్తులకు గ్రామ సమీపాన రామప్ప దేవాలయం వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే భక్తులకు స్నానమాచరించేందుకు వసతి ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్ర మాలు ఆరు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చులను గ్రామస్థుల, దాతల సహకారంతో భోజన వసతి కల్పిస్తారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఏర్పాటు చేస్తారు. గత 28 సంవ త్సరాల నుండి భోజన వసతిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆసుపత్రి ఓపి ప్రాంతంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని 3వ పట్టణ పోలీసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓపి పక్కన ఉదయం 9గంటల ప్రాంతంలో గుర్తు తెలియని మగమనిషి చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి విచారించగా అతని వివరాలు లేకపోవడంతో శవాన్ని ప్రభుత్వ ఆసుప్రతిలో మార్చురీకి తరలించారు. వ్యక్తి ఆనవాలు దాదాపు 36సం॥లు ఉండవచ్చని, వ్యక్తి నలుపు వర్ణం మాసిన గడ్డంతో ఉన్నాడని, తెలుగు, ఆకు పచ్చ,నీలం,పసుపు రంగు గల టీషర్టును ధరించాడని, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని ఎవరైనా ఇతని అచూకీని గురిస్తే 3వ పట్టణ పోలీస్‌స్టేషన్ 9121101061కు తెలిపాలని పోలీసులు కోరారు.

# ఆధునిక సాంకేతికతో నేరస్తులపై నిఘా ఉంచాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఆధునిక సాంకేతికతో నేరుస్తులపై నిఘా ఉంచి నేరాల నియంత్రణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీసులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐడి ఐజి వినీత్ బ్రిజ్ లాల్ హాజరై ఎస్పీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో పోలీస్‌స్టేషన్లలో నమోదయ్యే ప్రతి కేసు వివరాలను, ప్రతి అంశాన్ని సిసిటిఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికి ఉపయోగపడేలా దోహదపడుతుందన్నారు.





సిసిటిఎన్ఎస్‌లో ముఖ్యంగా గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో పార్ట్-1, పార్ట్-2 సీడీలు అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. మర్డర్ కేసుల్లో, 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన పురోగతి పొందేలా చూసుకుంటూ అభియోగ పత్రాలను వీలైనంత తొందరగా కోర్టులో దాఖలు చేయాలన్నారు. డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తు చేస్తున్నప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్నూలు,పత్తికొండ,ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లలో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి ఎస్పీ సమీక్షించి ఆరాతీశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ అండ్ అడ్మిన్ ఎస్పీ జి హుస్సేన్ పీరా,ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పీలు బాబూ ప్రసాద్, శ్రీనివాస ఆచారి, ఉపేంద్రబాబు, హేమలత, భాస్కర్‌రావు, ట్రైనీ డిఎస్పీ ఉషశ్రీ,సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.